



ఆమదాలవలస రైల్వే స్టేషన్‌లో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

తీరంలో అప్రమత్తం



బుడగట్లపాలెంలో మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న మెరైన్ పోలీసులు

- ప్రత్యేక కెమెరాలతో పర్యవేక్షిస్తున్న పోలీసులు

ఎచ్చెర్ల/రణస్థలం, మే 7(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత్ దాడి చేసి ముష్కరులను మట్టుబెట్టిన నేపథ్యంలో తీరం వెంబడి పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రత్యేక కెమెరాలతో సముద్ర తీరప్రాంతాన్ని పర్యవేక్షిస్తున్నారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్‌లో ప్రభుత్వం, ప్రజలు తీవ్ర ఆవేదనతో ఉన్నారు. ఈ క్రమంలో 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత పాకిస్థాన్‌తో పాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత్ సైన్యం ముప్పేట దాడి చేసి మట్టుబెట్టింది. దీంతో భారత్‌పై ఉక్రోశంగా ఉన్న పాకిస్థాన్ ఏ మార్గంలోనైనా మళ్లీ దాడి చేయొచ్చునని, ఏదైనా పన్నాగం పన్నవచ్చునని పోలీసులు అనుమానిస్తూ అప్రమత్తమయ్యారు. తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తూ అవగాహన కల్పించారు. జిల్లాలో రణస్థలం మండలం దోనిపేట నుంచి ఇచ్ఛాపురం మండలం డొంకూరు వరకూ 193 కిలోమీటర్ల మేర సముద్ర తీరం ఉంది. రణస్థలం, ఎచ్చెర్ల, శ్రీకాకుళం రూరల్, గార, పోలాకి, సంతబొమ్మాళి, వజ్రపుకొత్తూరు, మందస, సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం మొత్తంగా 11 తీర మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 120 మత్స్యకార తీర గ్రామాలు ఉన్నాయి. ఈ తీరప్రాంత గ్రామాల్లో మెరైన్ పోలీసులు బుధవారం పర్యటించారు. బుడగట్లపాలెం, జీరుపాలెం, కొమరవానిపేట, కొత్తముక్కాం తదితర గ్రామాల్లో సమావేశాలను నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎలాంటి సంఘటనలు జరిగినా, అపరిచిత వ్యక్తులు తీర గ్రామాల్లో కనిపించినా వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. సముద్రం గుండా ఉగ్రవాదులు చొరబడితే ఎలా పట్టుకోవాలో అన్నదానిపై పోలీసులు, మెరైన్ సిబ్బంది పలుచోట్ల మాక్‌డ్రిల్ కూడా నిర్వహించారు. ఈ విషయమై కళింగపట్నం మెరైన్ పోలీసుస్టేషన్ సీఐ బి.ప్రసాదరావు వద్ద ప్రస్తావించగా.. పాకిస్థాన్‌లోని ఉగ్రమూకల శిబిరాలపై భారతదేశం 'ఆపరేషన్ సిందూర్' పేరిట చేసిన దాడుల నేపథ్యంలో.. ముందస్తు జాగ్రత్తగా తీరప్రాంతాన్ని అప్రమత్తం చేశామని తెలిపారు. తీర గ్రామాల్లో సమావేశాలను నిర్వహిస్తున్నామన్నారు.

ప్రతి పౌరుడూ సైనికుడు కావాలి

- శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద
- ఆమదాలవలస రైల్వే స్టేషన్‌లో మాక్‌డ్రిల్

6లో

కొత్త రైస్ కార్డులు వస్తున్నాయ్



- వసుంధర గ్రామానికి చెందిన ఎస్.వరదరాజులు రేషన్‌కార్డు కోసం రెండేళ్ల నుంచి ఎదురుచూస్తున్నాడు. వివాహమై ఒక ఆడపిల్ల జన్మించినా.. రేషన్‌కార్డు లేక ఇబ్బందులు పడుతున్నాడు. తాజాగా బుధవారం ఆయన సచివాలయానికి వెళ్లి కొత్త రైస్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. త్వరలో కొత్త రైస్ కార్డు వచ్చే అవకాశం ఉంది.

- సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ
- నెలరోజులపాటు కొనసాగునున్న ప్రక్రియ
- మార్పులు, చేర్పులకూ అవకాశం

- మెళియాపుట్టి గ్రామానికి చెందిన కె.మేమనాథానికి ఏడాదిన్నర కిందట వివాహమైంది. తమ రేషన్‌కార్డులో భార్య పేరు చేర్పించాలని కార్యాలయాల చుట్టూ తిరిగినా.. ఫలితం లేకపోయింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం రైస్‌కార్డుల్లో మార్పులు, చేర్పులకు దరఖాస్తులు స్వీకరిస్తుండడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.

- ఎంసీపీ కొత్తూరు గ్రామానికి చెందిన సవర కూర్మారావుకు వివాహమై రెండున్నరేళ్లు అవుతున్నా.. రేషన్‌కార్డు లేక ఇబ్బందులు పడుతున్నాడు. కార్డు లేకపోవడంతో ఇల్లు స్థలం, తదితర ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం కొత్త రైస్ కార్డులకు అవకాశం కల్పించడంతో హర్షం వ్యక్తం చేస్తున్నాడు.

మెళియాపుట్టి, మే 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం త్వరలో కొత్త రైస్ కార్డులు ఇవ్వనుంది. బుధవారం నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభించింది. నెలరోజులు దరఖాస్తులు స్వీకరించనుంది. ఆపై వాటిని పరిశీలించి అర్హులకు కార్డులు ఇవ్వనుంది. మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించడంతో దరఖాస్తుదారుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. జిల్లాలో 1,625 రేషన్ దుకాణాల పరిధిలో 6,71,803 కార్డులు ఉన్నాయి. ఇందులో తెలుపు కార్డులు 6,35,471 ఉండగా.. 36,332 అంత్యోదయ కార్డులు ఉన్నాయి. మొత్తంగా 19,77,693 మంది లబ్ధిదారులకు ప్రతినెలా 422 ఎండీయూ

(మిగతా 6వ పేజీలో..)

రెండు వంతెనలు.. రూ.100 కోట్లు

- ఫ్లైఓవర్‌ల నిర్మాణానికి రైల్వేశాఖ ఆమోదం
- టెండర్ పూర్తయితే ప్రారంభం కానున్న పనులు
- నెరవేరనున్న పలాస-కాశీబుగ్గ ప్రజల ఆకాంక్ష



కాశీబుగ్గలో ఫ్లైఓవర్ లేకపోవడంతో.. నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడుతున్న పాత జాతీయరహదారి



పలాస, మే 7(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీకి మహర్దశ పట్టనుంది. కూటమి ప్రభుత్వ పాలనలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడి చొరవతో రెండు రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిలు నిర్మించనున్నారు. ఇందుకోసం రూ.100 కోట్లు కేటాయించనున్నట్టు రైల్వే మంత్రిత్వశాఖ నుంచి ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈ నిధులతో పలాస రైల్వేస్టేషన్‌కు ఇరువైపులా తాళభద్ర, కాశీబుగ్గ (చిన్నబడాం రోడ్)లో ఫ్లైఓవర్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. కాశీబుగ్గ ఫ్లైఓవర్ బ్రిడ్జికి 2008లో శంకుస్థాపన చేసి.. సగంలో నిర్మాణాలు నిలిపేశారు. అలాగే వజ్రపుకొత్తూరు, పలాస మండలాలతోపాటు పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలోని ప్రధాన వార్డులకు వెళ్లేందుకు వీలుగా తాళభద్ర ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కాశీబుగ్గ ఫ్లైఓవర్ పూర్తి చేసే ఎన్నికలకు వెళ్తామని అప్పటి నాయకులు ప్రకటించారు. కానీ పనుల ఊసే లేదు. దీంతో ప్రజల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత ఎదురైంది. ప్రస్తుత కూటమి పాలనలో పలాస ఎమ్మెల్యేగా గౌతు శిరీష ఎన్నికైన తరువాత మొదటి ప్రాధాన్యంగా ఫ్లైఓవర్ అంశాన్ని లేవనెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధుల కొరత కారణంగా పనులపై నీలినీడలు అలముకున్నాయి. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు సహకారంతో ఢిల్లీ వెళ్లి కేంద్ర రైల్వేమంత్రి అశ్వనీవైష్ణవ్‌ను కలిసి ఆర్వోబీ సమస్యను ఎమ్మెల్యే శిరీష వివరించారు. తాళభద్ర రైల్వే బ్రిడ్జి సమస్య కూడా ప్రస్తావించారు. దీంతో మొత్తం నిధులన్నీ రైల్వే శాఖే సమకూర్చి రెండు రైల్వే ఫ్లైఓవర్‌లు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. నిధులకు ఆమోదం కూడా తెలిపారు. టెండరు ప్రక్రియ పూర్తయితే రెండు బ్రిడ్జిల నిర్మాణం సకాలంలో పూర్తికానున్నాయి. ఏళ్ల తరబడి కల నెరవేరుతుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

100 గ్రామాలకు తీరనున్న గేటు కష్టాలు

వజ్రపుకొత్తూరు, మే 7(ఆంధ్రజ్యోతి): తాళభద్ర రైల్వేగేటు.. ఉద్దానం ప్రజల చిరకాల సమస్యల్లో ఒకటి. గేటు తెరిచిన సమయం కంటే మూసిఉంచినదే అధికమని ఈ ప్రాంతవాసులు తరచూ అసహనం చెందుతారు. పలాస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో సుమారు 100 గ్రామాల ప్రజలు ఈ గేటు మార్గం మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. మార్కెట్‌కు, పాఠశాలలకు, కళాశాలలకు, ఆస్పత్రులకు, రైల్వేస్టేషన్‌కు వెళ్లాలన్నా ఇదే ప్రధాన మార్గం. తరచూ గేటు పడుతుండడంతో రహదారిపై ట్రాఫిక్ స్తంభించిపోతోంది. అత్యవసర సమయాల్లో పేషెంట్లు కూడా సకాలంలో ఆస్పత్రికి వెళ్లలేక మృతి చెందిన సందర్భాలు ఉన్నాయి. బ్రిటీష్ కాలంలో ఏర్పాటు చేసిన ఈ గేటు సమస్య ఎప్పటికి తీరుతుందోనని ఈ ప్రాంతవాసులు ఎదురుచూస్తూనే ఉన్నారు. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష కృషితో ఎట్టకేలకు ఇక్కడ రైల్వే ఫ్లైఓవర్ నిర్మించనుండడంతో ఉద్దానం ప్రాంతవాసులు, టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సుమారు వంద గ్రామాల ప్రజలకు గేటు కష్టాలు తీరనున్నాయని ఊరట చెందుతున్నారు.

ప్రజలకు కానుకగా ఇస్తాం



కాశీబుగ్గ, తాళభద్ర రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిల నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు కానుకగా ఇస్తాం. ఇప్పటికే నిర్మాణ బాధ్యతలను రైల్వే శాఖ తీసుకొంది. శత శాతం నిధులు రైల్వేశాఖ భరించనుంది. గత ప్రభుత్వం దీనికి నిధులు వెచ్చించక పోవడంతో నిర్మాణ దశలోనే పనులు ఆగిపోయాయి. రూ.వంద కోట్ల మేరకు నిధులు బ్రిడ్జిల నిర్మాణానికి కేటాయించినందుకు రైల్వేశాఖకు ధన్యవాదాలు.

-రామ్మోహన్‌నాయుడు, కేంద్రమంత్రి

ప్రజల ఆకాంక్ష నెరవేరుతున్న వేళ



రెండు రైల్వే ప్రధాన బ్రిడ్జిలకు నిధులు రైల్వే శాఖ కేటాయించడం ప్రజల ఆకాంక్షలు నెరవేరినట్లే. గత ప్రభుత్వం పట్టించుకున్నట్లయితే ఇప్పటికే నిర్మాణం పూర్తయ్యేది. నిధులు కేటాయింపునకు కృషి చేసిన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, రైల్వేమంత్రి అశ్వనీవైష్ణవ్‌కు పలాస నియోజకవర్గ ప్రజల తరపున ధన్యవాదాలు.

-గౌతు శిరీష, ఎమ్మెల్యే, పలాస

ఇబ్బందులు పడ్డాం



తాళభద్ర వద్ద రైల్వే గేటు అధిక సమయం పడుతుండడంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు, ఆస్పత్రికి వెళ్లే రోగుల అవస్థలు అన్నీఇన్నీ కావు. గేటు బాధపడలేక కొంతమంది గ్రామాలు విడిచి పలాస-కాశీబుగ్గలో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. గేటు సమస్యకు పరిష్కారం చూపుతూ.. బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేసిన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే శిరీషకు ఉద్దానం ప్రజలు రుణపడి ఉంటారు.


-పోతనపల్లి షణ్ముఖరావు, పల్లిసారథి

అగమ్యగోచరం!



పురుషోత్తపురంలోని ఆదర్శ పాఠశాల

- ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయుల్లో ఆందోళన
- వర్తించని సర్వీస్ రూల్స్, దక్కని పీఎఫ్
- కారుణ్య నియామకాలకు నో చాన్స్
- బదిలీల్లోనైనా న్యాయం చేయాలని విజ్ఞప్తి



ఇచ్ఛాపురం, మే 7(ఆంధ్రజ్యోతి):

ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. పేరుకే ఉపాధ్యాయులం కానీ.. సాధారణ ప్రభుత్వ ఉపాధ్యాయుల మాదిరిగా ప్రయోజనాలు లేవని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్ద కాలానికిపైగా ఎదుగుబొదుగూ లేకుండా ఉన్నామని వాపోతున్నారు. కనీసం ఈసారి బదిలీల్లోనైనా న్యాయం చేయాలని కోరుతున్నారు. పేద విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం విద్యను అందించాలనే ఉద్దేశంతో 2012-13లో రాష్ట్ర వ్యాప్తంగా 164 ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు చేశారు. ఇవి పాఠశాల విద్యాశాఖ పరిధిలో ఉన్నాయి. కానీ ఈ పాఠశాలలతో అనుబంధంగా ఉండే వసతిగృహాలు రాజీవ్ విద్యామిషన్‌లో ఉన్నాయి. దీంతో ఇక్కడ పనిచేసే పోస్టు గ్రాడ్యుయేషన్ టీచర్స్ (పీటీజీ), ట్రైనింగ్ గ్రాడ్యుడ్ టీచర్స్(టీజీటీ)తో పాటు ఉపాధ్యాయేతర సిబ్బంది ఓ ఏజెన్సీ కింద నిర్వహిస్తున్నారు. దీంతో సాధారణ ప్రభుత్వ ఉపాధ్యాయులకు లభించే చాలా రకాల ప్రయోజనాలు దక్కడం లేదు. చివరకు కోరుకున్న చోటకు బదిలీలు కూడా జరగడం లేదు. దీంతో దశాబ్దాలుగా జిల్లాకు దూరంగా వీరు విధులు నిర్వహిస్తున్నారు.

ఆదరణ ఉన్నా.. ప్రయోజనం సున్నా..

రాష్ట్రవ్యాప్తంగా నాలుగు జోన్లుగా విభజించి ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు చేశారు. ఉత్తరాంధ్ర జోన్-1లో ఉమ్మడి మూడు జిల్లాలు ఉన్నాయి. మొత్తం 35 పాఠశాలలను ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి 14 పాఠశాలలను ఏర్పాటు చేశారు. జిల్లాలోని పొందూరు, రణస్థలం, కుప్పిలి, లావేరు, జి.సిగడాం, పోలాకి, జలుమూరు, కవిటి, సోంపేట, ఇచ్ఛాపురం, భామిని, పాతపట్నం, కంచిలి, ఓవీ పేట (బూర్జ)లో ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 6 నుంచి ఇంటర్ వరకూ తరగతులు ఉంటాయి. 14 పాఠశాలల్లో ఏటా ప్రవేశ పరీక్ష నిర్వహించి.. 1400 సీట్లను ఆరో తరగతిలో భర్తీ చేస్తున్నారు. ఈ పాఠశాలల్లో ప్రవేశాలకు విపరీతంగా డిమాండ్ ఉంటుంది. కార్పొరేట్ స్థాయిలో ఆంగ్ల మాధ్యమంలో ఇక్కడ బోధన అందిస్తారు. నైతికవిలువలు, స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్ విషయంలో ప్రత్యేక బోధన ఉంటుంది. అన్ని సదుపాయాలతో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ల్యాబ్‌తోపాటు గ్రంథాలయం ఉంది. అన్నీ బాగున్నా ఇక్కడ ఒకే పాఠశాలలో ఏళ్ల తరబడి ఉపాధ్యాయులు ఉండిపోవడం మాత్రం అనేక ఇబ్బందులకు కారణమవుతోంది. తొలుత ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో కొంతమందిని మోడల్ స్కూల్స్‌కు పంపించి బోధన చేయించారు. తరువాత ప్రతి డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తూ వస్తున్నారు. ప్రతి పాఠశాలలో 16 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. అందులో పీటీజీలు 9,10,11 తరగతులకు బోధన సాగిస్తారు. 6,7,8 తరగతులకు టీజీటీలు బోధిస్తారు. జిల్లాలో మొత్తం 200మంది వరకూ ఉపాధ్యాయులు పనిచేస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. వీరంతా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. వీరికి ఇతర ఉపాధ్యాయుల మాదిరిగా సర్వీస్ రూల్స్ అమలుకావడం లేదు. ఆర్థిక ప్రయోజనాలు దక్కడం లేదు. కారుణ్య నియామకాలకు అవకాశం లేకుండా పోతోంది. కనీసం పీఎఫ్ సదుపాయం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ప్రభుత్వ ఉద్యోగులతోపాటు ఉపాధ్యాయులకు పదవీ విరమణ (మిగతా 6వ పేజీలో..)



రైతులకు తీపికబురు

- 'అన్నదాతా సుఖీభవ'తో 3.56 లక్షల మందికి లబ్ధి
- 13 వేల మంది కౌలు రైతులకు కూడా..
- ఈ నెలలోనే డబ్బులు జమ

6లో



లక్ష్మీ (ఫైల్)

అనుమానంతో భార్య హత్య

- కోటబొమ్మాళి మెయిన్‌రోడ్డులో ఉలికిపాటు

ఇప్పిలిలో వృద్ధుడు..

- నిద్రలోనే చంపేసిన వైనం
- పోలీసుల అదుపులో నిందితుడు?

8లో

ప్రతి పౌరుడూ సైనికుడు కావాలి

- మనల్ని మనమే రక్షించుకుందాం
- శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద
- ఆమదాలవలస రైల్వేస్టేషన్‌లో మాక్‌డ్రిల్


ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ

ఆమదాలవలస, మే 7 (ఆంధ్రజ్యోతి): యుద్ధం వస్తే ప్రతి పౌరుడూ ఒక సైనికుడు కావాలని, మనల్ని మనమే రక్షించుకుందామని శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద, ఆర్డీవో సాయిప్రత్యూష పిలుపునిచ్చారు. యుద్ధం వచ్చినప్పుడు ఎలా రక్షించుకోవాలి, ఎదుటవారిని ఎలా రక్షించాలి అనే వాటిపై ఆమదాలవలస రైల్వేస్టేషన్ ఆవరణలో బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించి ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. పాకిస్థాన్‌కు, మనకు యుద్ధం వస్తే ప్రజలంతా కంగారు పడాల్సిన అవసరం లేదన్నారు. ఎవరికి వారు ధైర్యంగా మెలుగుతూ దేశరక్షణకు ముందుకు రావాలని సూచించారు. ప్రతి ఒక్కరూ దేశరక్షణ కోసం ముందడుగు వేయాలన్నారు. యుద్ధంలో గాయపడిన వారికి, చిన్నారులకు తక్షణ వైద్య సహాయం అందించడం, అంబులెన్స్‌లో తరలించడం, బాంబ్ బ్లాస్ట్, తదితర అంశాలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి జె.మోహన్‌రావు, శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్ సర్కిల్ అధికారి ఎస్.కాంతారావు, ఆమదాలవలస సీఐ సత్యనారాయణ, అగ్నిమాపక అధికారి అప్పారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ సిందూ' మాక్‌డ్రిల్..

పలాస, మే 7(ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్ ఉగ్రవాదులపై భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూ' నేపథ్యంలో పలాస రైల్వే స్టేషన్‌లో బుధవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. యుద్ధ సమయంలో ప్రజలను అప్రమత్తం చేయడం, వారికి కల్పించే సదుపాయాలు, మెడికల్ సిబ్బంది ఎలా అప్రమత్తంగా ఉంటారో వివరించారు. ఈ సందర్భంగా సీఐ పి.సూర్యనారాయణ విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజలను అప్రమత్తం చేసేందుకు మాక్‌డ్రిల్ నిర్వహించామన్నారు. పోలీసుశాఖ, అగ్నిమాపక, రెవెన్యూ, విద్యుత్, వైద్యఆరోగ్యశాఖ, మునిసిపాలిటీ తదితర శాఖల అధికారులతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఫైర్ సిబ్బంది తమ వాహనాలను రైల్వే స్టేషన్ వద్ద పెట్టి ముందుగా సైరన్ మోగించారు. అనంతరం మాక్‌డ్రిల్ చేపట్టారు.


పలాస రైల్వే స్టేషన్ వద్ద మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీనివాసుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- తొలిరోజు పల్లకిలో ఊరేగింపు
- అద్దాల మండపంలో దర్శనమిచ్చిన శ్రీవారు


శ్రీనివాసుని పల్లకిలో వేంచేపు చేసి తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం

నరసన్నపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పరిషత్ విజ్ఞాపన, రక్షాసూత్ర ధారణ, పంచగవ్యప్రాసన, యాగశాల ప్రవేశం తదితర కార్యక్రమాలు చేపట్టారు. వేద పండితుడు చామర్తి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో రుత్వికులు జోస్యుల జగన్నాథశర్మ, మావుడూరు జగదీష్‌బాబు, చామర్తి సత్యసాయి కృష్ణమాచార్యులు, జోస్యుల సుందరవేణు గోపాలశర్మ తదితరుల నేతృత్వంలో కార్యక్రమాలు ప్రారంభించారు. సాయంత్రం స్వామి వారిని పల్లవిలో వేంచేపు చేసి వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలు, తప్పెట గుళ్లు, కోలాటాలతో తిరువీధి ఉత్సవం చేపట్టారు.

అద్దాల మండపంలో..

శ్రీదేవి, భూదేవి, సహిత వేంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి అద్దాల మండపంలో ఉంచారు. భక్తులు స్వామిని దర్శించుకుని తరించారు. గురువారం నుంచి స్వామి వారికి వాహనసేవ నిర్వహించనున్నారు. సాయంత్రం స్వామివారు హంస వాహనంపై పట్టణ వీధుల్లో విహరిస్తారు. ప్రతిరోజూ సుప్రభాత సేవ, తిరువారాధన, మంగళాశాసనం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.


అద్దాల మండపంలో దర్శనమిచ్చిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు

రైతులకు తీపికబురు

- 'అన్నదాతా సుఖీభవ'తో 3.56 లక్షల మందికి లబ్ధి
- 13 వేల మంది కౌలు రైతులకు కూడా..
- ఈ నెలలోనే బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ
- సీఎం చంద్రబాబు ప్రకటనపై హర్షం

మెళియాపుట్టి, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు తీపికబురు అందించింది. ఈనెలలోనే అన్నదాతా సుఖీభవ నిధులు జమ చేస్తామని సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. అర్హులైన రైతులకు రూ.20వేల ఆర్థిక సాయం నేరుగా బ్యాంకు ఖాతాలో వేయనున్నారు. ఎన్నికలకు ముందు టీడీపీ కూటమి అన్ని వర్గాలకు మేలుచేసే మ్యానిఫెస్టోను విడుదల చేసింది. అధికారంలోకి వచ్చాక వీటన్నింటినీ ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ వస్తోంది. తాజాగా అన్నదాతా సుఖీభవను ఈ నెలలో అందించనుంది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేసింది. లబ్ధిదారుల జాబితాను ఈనెల 20 తేదీలోపు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. జిల్లాలో 4,47,382 ఎకరాలను 3.56 లక్షల మంది సాగు చేస్తున్నారు. వీరిలో అర్హులైన వారికి లబ్ధి చేకూరనుంది. అలాగే 13వేల మంది వరకు కౌలు రైతులు ఉండవచ్చునని వ్యవసాయశాఖ అధికారులు అంచనవేస్తున్నారు.

రైతులకు మేలు జరిగేలా..

రైతులకు మేలు జరిగేలా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న సాయంతో కలిసి రాష్ట్రప్రభుత్వం రైతులకు డబ్బులు ఇవ్వనున్నారు. గత వైసీపీ ప్రభుత్వం రైతుభరోసా కింద ఏడాదికి రూ13 వేలు మాత్రమే ఇచ్చేది. అయితే టీడీపీ కూటమి ప్రభుత్వం అదే సాయాన్ని ప్రతిఏటా రూ.20 వేలకు పెంచింది. పీఎం కిసాన్ రూ.6వేలతో పాటు రాష్ట్రప్రభుత్వం మరో రూ.14 వేలు కలిపి మూడు విడతల్లో రైతులకు ఇవ్వనుంది. దీంతోపాటు పోడు భూములు సాగు చేస్తున్న గిరిజనులకూ ఆర్థికసాయం ఇస్తుండడంతో వారిలో హర్షం వ్యక్తమవుతోంది.

అంతా ఆన్‌లైన్‌లోనే..

అన్నదాతా సుఖీభవ పథకంలో గ్రామస్థాయిలో వ్యవసాయశాఖ అసిస్టెంట్లు, రెవెన్యూలో వీఆర్వోలు కీలకం కానున్నారు. ప్రాథమిక లబ్ధిదారుల జాబితా వారు తయారు చేస్తారు. ఆ జాబితాను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే తహసీల్దార్లు, వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలిస్తారు. దీన్ని వ్యసాయశాఖ కమిషనర్ పోర్టల్‌లో ఆప్‌లోడ్ చేస్తే.. సదరు జాబితాలోని రైతుల ఖాతాలకు నగదు జమ చేస్తారు.



గిరిజనులకు మేలు జరుగుతుంది..



కూటమి ప్రభుత్వం గిరిజన రైతులను ఆదుకునే చర్యలు తీసుకుంటోంది. పోడు పట్టాదారులకు సైతం అన్నాదాతా సుఖీభవ పథకం వర్తింపజేయడంతో ఎంతో మేలు జరుగుతుంది. గతంలో ఎన్నడూలేని విధంగా ప్రతిఏటా రూ. 20 వేలు ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించటం అభినందనీయం.

-లక్ష్మీనారాయణ, మెళియాపుట్టి

సంతోషంగా ఉంది..



రైతులకు కష్టకాలంలో అన్నదాతా సుఖీభవ డబ్బులు ఈ నెలలో జమ చేస్తామని సీఎం ప్రకటించటడం ఆనందంగా ఉంది. ఈ డబ్బులు ముందు దుక్కులు చేసుకోవటానికి ఉపయోగపడుతాయి. అప్పులు లేకుండా సాగుచేసుకునే అవకాశం కలుగుతుంది. గతంలో సాగు చేసిన వారికి అప్పులు కనిపించగా.. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం వల్ల లాభదాయకంగా ఉంటుంది.

-సింగుపురం రమేష్, జగన్నాథపురం

జాబితా సిద్ధం చేయాలని అదేశాలు వచ్చాయి..



ప్రస్తుతం భూములు ఉన్న రైతుల జాబితాతో పాటు పోడు పట్టాల ఉండి సాగు చేస్తున్న వారి జాబితాను సిద్ధ చేయాలని అదేశాలు వచ్చాయి. రైతు సేవా కేంద్రాల ద్వారా రెవెన్యూ అధికారులకు పంపిస్తాము. అక్కడి నుంచి మళ్లీ వ్యవసాయశాఖ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి అర్హులైన రైతుల జాబితాను పంపిస్తాము.

-లింగాల మధుబాబు, వ్యవసాయశాఖ ఏడీ, పలాస

అగమ్యగోచరం!

(ఐదో పేజీ తరువాయి)

వయసు 62 ఏళ్లు. వీరికి మాత్రం 60ఏళ్లు. ఐదేళ్ల సర్వీస్ ఉంటేనే బదిలీ నిబంధన వీరి పాలిట శాపంగా మారింది. జోనల్ వారీ నియామకాలు కావడంతో విశాఖ జిల్లాకు చెందిన వారు శ్రీకాకుళంలో.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన వారు విశాఖ, విజయనగరం జిల్లాలో పని చేస్తున్నారు. బదిలీలు జరగక అవస్థలు పడుతున్నారు. 2018 డీఎస్సీకి సంబంధించి నియామకాలు 2019లో జరిగాయి. 2022లో వైసీపీ ప్రభుత్వం బదిలీలు చేసింది. కానీ కటాఫ్‌గా ఒక నెల చాలని కారణంగా వందలాది మంది బదిలీ ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో చాలామంది దశాబ్ద కాలంగా అదే పాఠశాలల్లో కొనసాగుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలకు పచ్చజెండా ఊపిన నేపథ్యంలో తమను పరిగణనలోకి తీసుకోవాలని వారు కోరుతున్నారు. త్వరలో డీఎస్సీ భర్తీలో మోడల్ పాఠశాలల్లో ఖాళీలను చూపించి బదిలీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

బదిలీలకు అవకాశం కల్పించాలి..

విజయనగరం జిల్లా నుంచి వచ్చి శ్రీకాకుళం జిల్లా పురుషోత్తపురం మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా గత నాలుగేళ్లుగా పనిచేస్తున్నాను. బదిలీలు లేకపోవటంతో ఇబ్బందులు పడుతున్నాం. బదిలీలకు అవకాశం కల్పించాలి.

-రమణ, ఉపాధ్యాయుడు, పురుషోత్తపురం ఆదర్శ పాఠశాల

సమస్యలు పరిష్కరించాలి..


సాధారణ ఉపాధ్యాయుల మాదిరిగానే.. ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులను పరిగణించాలి. ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలి. ముఖ్యంగా బదిలీల్లో పారదర్శకత పాటించాలి. నిబంధనలు సడలించి అందరికీ అవకాశం ఇవ్వాలి. పీఎఫ్‌తో పాటు కారుణ్య నియమకాలకు అనుమతులివ్వాలి. డీఎస్సీ-2025లో ఖాళీలను చూపించి బదిలీలకు అవకాశం కల్పించాలి.

-సురేష్, మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయ సంఘ నేత, పాతపట్నం

శ్రీకూర్మ క్షేత్రంలో కొట్నం దంపు

గార, మే 7 (ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మనాథుని కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి కొట్నం దంపు కార్యక్రమం నిర్వహించారు. ముందుగా విశ్వక్సేన, పుణ్యా హవాచనం తదితర పూజలు చేశారు. అనంతరం ప్రధాన అర్చకులు సీతారామ నరసింహాచార్యులు ఇతర అర్చక స్వాములు కొట్నంలో సుగంధ ద్రవ్యాల మర్దనం చేశారు. ఈవో కె.నరసింహ నాయుడు, ఇతర సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


సుగంధ ద్రవ్యాల మర్ధనం చేస్తున్న అర్చకులు


నారాయణ తిరుమల ఆలయం

నేటి నుంచి కల్యాణోత్సవాలు..

శ్రీకాకుళం కల్చరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం పీఎన్ కాలనీలోని నారాయణ తిరుమలలో గురువారం నుంచి ఈ నెల 12 వరకు వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు జరగనున్నాయి. మొదటి రోజు శ్రీవారి వజ్రకవచ దర్శనం, స్వామి కల్యాణం, 9న వేంకటేశుని విశ్వరూప దర్శనం, కుంకుమ పూజలు, 10న స్వామి స్వర్ణ కవచ దర్శనం, ఊయల సేవ, 11న రజత కవచ దర్శనం, గరుడ వాహన సేవ, తిరువీధి, 12న పుష్పకవచ దర్శనం, పుష్పయాగం మహోత్సవం తదితర పూజాది కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా మొండేటి వారి వీధిలోని షిరిడీ సాయి ఆలయంలో వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు గిడుతూరి వెంకటేశ్వరరావు తెలిపారు.

కొత్త రైస్‌కార్డులు వస్తున్నాయ్

(ఐదో పేజీ తరువాయి)

వాహనాల ద్వారా 9.737 టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రతీ ఆరు నెలలకోసారి రేషన్‌కారులు మంజూరు చేస్తామని ప్రకటించింది. కానీ, 2023 మే నుంచి కొత్త రేషన్‌కార్డుల పక్రియ నిలిపేసింది. దీంతో చాలామంది రేషన్‌కార్డులు లేక ఇబ్బందులు పడుతున్నారు. రేషన్‌కార్డు కేవలం సబ్సిడీతో అందిస్తున్న సరుకులకే పరిమితం కాకుండా ప్రభుత్వ పథకాలకూ ముడిపడి ఉంది. ప్రధానంగా వైద్యసేవలు పొందేందుకు ఆరోగ్యశ్రీతో పాటు, పేద విద్యార్థుల ఉన్నత చదువులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర ఎన్నో సౌకర్యాలు పొందే అవకాశం ఉంది. కాగా రేషన్‌కార్డులేకపోవడంతో చాలామంది ప్రభుత్వ పథకాలకు నోచుకోవడం లేదు. జిల్లాలో సుమారు 25వేల మంది కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరంతా గత రెండేళ్ల నుంచి రేషన్‌కార్డుల కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. ప్రస్తుత ప్రభుత్వం బుధవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించడంతో వారంతా ఊరట చెందుతున్నారు.

తప్పులు సరిదిద్దుకునేలా..

రేషన్‌కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించారు. కొత్త కార్డుకు దరఖాస్తు, కుటుంబ సభ్యుల విభజన, కొత్త సభ్యుల చేర్పు, చిరునామా మార్పు, మృతుల పేర్లు తొలగింపు, రేషన్ కార్డు స్వచ్ఛందంగా వదులుకోవడం.. తదితర వాటికి ఆప్షన్లు ఇచ్చారు. గతంలో తప్పుడు చిరునామాతోపాటు ఇంటి పేర్లు, లబ్ధిదారుల పేర్లు తప్పులుగా ఉండడంతో చాలా ఇబ్బందులు పడ్డారు. అటువంటి వారికి మార్పులు చేసుకోనే అవకాశం కల్పించడంతో ఊరట లభించనుంది. పాత రేషన్‌కార్డుల లబ్ధిదారులకు జూన్‌లో క్యూఆర్ కోడ్‌తో కూడిన కొత్త కార్డులు అందజేయనున్నారు. కార్డులపై మాజీ ముఖ్యమంత్రి బొమ్మలను తొలగిస్తారు. కుటుంబ యజమాని పేరు, ఫొటో, కుటుంబ సభ్యుల సంఖ్య, రేషన్ దుకాణం ఐడీ, చిరునామా, క్యూఆర్ కోడ్‌తో కార్డులు అందజేస్తారు. ఈ విషయమై మెళియాపుట్టి తహసీల్దార్ బి.పాపారావు వద్ద ప్రస్తావించగా.. ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయాల్లో రైస్‌కార్డుల దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించామని తెలిపారు. మార్పులు, చేర్పులకు కూడా అవకాశం కల్పించామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



వలకు చిక్కిన 15 కేజీల వాలుగు చేప

హిరమండలం, మే 7 (ఆంధ్రజ్యోతి): హిరమండలం మండలం గొట్టాబ్యారేజీ వద్ద వంశధార నదిలో బుధవారం మత్స్యకారుడు మురమళ్ల చిన్నారావు వలలో 15 కేజీల వాలుగు చేప పడింది. ఎప్పటిలాగే చిన్నారావు తోటి మత్స్యకారులతో కలిసి వేటకు గొట్టా బ్యారేజీ వద్దకు చేరుకుని వల వేశాడు. వలను తీస్తుండగా బరువుగా వస్తుండడంతో వలకు ఏదో తగిలి బరువుగా ఉందని భావించాడు. అయితే భారీ చేప ఉండడాన్ని గమనించి ఆనందం వ్యక్తం చేశాడు. దీనిని గమనించిన సందర్శకులు ఆ చేపతో ఫొటోలు తీసుకున్నారు.

సకాలంలో పుస్తకాలను అందజేయాలి: ఆర్జేడీ విజయభాస్కర్

ఎచ్చెర్ల/రణస్థలం, మే 7 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు సకాలంలో పాఠ్య, నోట్ పుస్తకాలను అందజేయాలని విద్యాశాఖ ఆర్జేడీ కె.విజయభాస్కర్ అన్నారు. ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, రణస్థలం జడ్పీ హైస్కూల్‌లో భద్రపరిచిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర (స్టూడెంట్ కిట్లు)ను బుధవారం పరిశీలించారు. విద్యా ప్రమాణాల మెరుగునకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఈ విద్యా సంవత్సరంలో పాఠ్య, నోట్ పుస్తకాలను విద్యార్థులకు సకాలంలో అందించి, నాణ్యమైన ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందన్నారు. ఎచ్చెర్ల మండలంలో 54,814 నోట్ పుస్తకాలు, 35,214 పాఠ్య పుస్తకాలు రణస్థలం మండలంలో 45,556 నోట్ పుస్తకాలు, 31,751 పాఠ్యపుస్తకాలు పంపిణీకి సిద్ధం చేసినట్టు చెప్పారు. డిప్యూటీ డీఈవో ఆర్.విజయ కుమారి, ఎంఈవోలు కె.పున్నయ్య, జి.రాజ్ కిశోర్, త్రినాథరావు, లావణ్య ఉన్నారు.


పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న ఆర్జేడీ విజయభాస్కర్, డిప్యూటీ డీఈవో విజయకుమారి

ముగిసిన నీలమణిదుర్గ యాత్రోత్సవాలు

పాతపట్నం, మే 7 (ఆంధ్రజ్యోతి): ఉత్కళాంధ్రుల ఆరాధ్యదైవం నీలమణి దుర్గ ఆలయ వార్షిక యాత్రా మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. రాత్రి డీవీ సుబ్బారావు కళానికేతన్ వారిచే ప్రముఖ కళాకారుడు పెద్దింటి మోహన్ దాసు మయ సభ ఏకపాత్రాభినయం ఆలోచింపజేసింది.



అల్లూరి జీవితం స్ఫూర్తిదాయకం

విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జీవితం స్ఫూర్తిదాయకమని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. జిల్లా వ్యాప్తంగా బుధవారం అల్లూరి వర్ధంతిని నిర్వహించారు. జిల్లా పోలీసు, కలెక్టర్ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఎస్పీ, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్ నివాళులు అర్పించారు. గిరిజనుల్లో చైతన్యం తీసుకొచ్చిన విప్లవ వీరుడు అల్లూరి అని కొనియాడారు.

-ఆంధ్రజ్యోతి బృందం


శ్రీకాకుళం క్రైం: అల్లూరి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి


శ్రీకాకుళం కలెక్టరేట్: అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్ తదితరులు


ఇచ్ఛాపురం: యూ కాంప్లెక్స్ వద్ద..


కంచిలి:బూరగాంలో


పలాస రూరల్: మాకన్నపల్లిలో


ఎల్ఎన్‌పేట: ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో..

ప్రశాంతంగా ఐసెట్

ఎచ్చెర్ల, మే 7 (ఆంధ్రజ్యోతి): ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన ఐసెట్ -2025 జిల్లాలో మూడు కేంద్రాల్లో బుధవారం ప్రశాంతంగా జరిగింది. ఆంధ్రాయూనివర్సిటీ పర్యవేక్షణలో శ్రీశివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం), కోర్ టెక్నాలజీస్ (నరసన్నపేట), ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల(టెక్కలి)లో ఐసెట్ జరిగింది. ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్ట్‌ల్లో ఈ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించారు.


శివానీ ఇంజనీరింగ్ కళాశాలలో అభ్యర్థుల హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న దృశ్యం

గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి

కంచిలి, మే 7 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని టీడీపీ మండల కార్యదర్శి మాదిన రామారావు అన్నారు. నువాగడ గ్రామంలో రూ.30లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని అన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, నాయకులు బొడ్డ హరిబాబు, సంజయ్‌పండా, భాస్కరరావు, బాలు, మోహన్ పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటే ప్రజలే తిరగబడతారు

- వైసీపీ నేతలను హెచ్చరించిన టీడీపీ


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పొందూరు, మే 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిని వైసీపీ నాయకులు అడ్డుకుంటే వారిపై ప్రజలే తిరగబడతారని మండల టీడీపీ నాయకులు అన్నారు. పార్టీ కార్యాలయంలో బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి వైసీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారు. చర్చకు రావాలంటూ పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ పిలుస్తున్నారని అన్నారు. రవికుమార్‌తో చర్చించే స్థాయి రవికుమార్‌కు ఉందా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, ఏఎంసీ మాజీ చైర్మన్ అన్నెపు రాము, పార్లమెంటు నియోజకవర్గ ప్రధానకార్యదర్శి సీపాన శ్రీరంగనాయకులు, తెలుగుయువత జిల్లా ప్రధానకార్యదర్శి బలగ శంకరభాస్కర్, నాయకులు బాడాన గిరి, కాలెపు శ్రీనివాసరావు, భవాని తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 41మంది ఎంపిక

ఇచ్ఛాపురం, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఫాక్సికన్ మేన్ ఫ్యాక్చరింగ్ కంపెనీకి 41మంది విద్యార్థులు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ రాబిన్‌కుమార్ పాడి తెలిపారు. వారికి కంపెనీ హెచ్ఆర్ గంగులరెడ్డి, రేష్మ జాబ్ ఆర్డర్ పత్రాలను అందజేశారు.

మునిసిపల్ కార్మికుల సమ్మె నోటీసు

సరుబుజ్జిలి, మే 7 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు తాడి సంతోష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెకు సంబంధించి నోటీసును పురపాలక సంఘ మేనేజర్ లక్ష్మీనారాయణ బిషోయ్‌కు బుధవారం అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు తారక్ వెంకటరావు, భాస్కరరావు, మంగమ్మ, రాములమ్మ, సత్యవతి, రాధ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను పూర్తిచేయాలి

జి.సిగడాం, మే 7(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం చేపడుతున్న వివిధ రకాల పనుల లక్ష్యాలను పూర్తి చేయాలని ఎంపీడీవో గుంట ముక్కల రామకృష్ణ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పలు శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫాంపాండ్, మొక్కల పెంపకం, మినీ గోకులాలు, ఇంకుడు గుంతలు, పశువుల నీటి తొట్టెల నిర్మాణం వంటి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఏపీవో సీహెచ్ సత్యనారాయణ, ఏవో ఎర్రా శారద, ఏపీఎం రెడ్డి రామకృష్ణం నాయుడు, పశువైద్యాధికారి సుమన్, ఉద్యాన వనశాఖాధికారి అనూష, ఈసీ పురిషోత్తమరావు పాల్గొన్నారు.

రేపు తీవ్ర వడగాడ్పులు

శ్రీకాకుళం, మే 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బూర్జ, హిరమండలం, జలుమూరు, ఎల్.ఎన్.పేట, పాతపట్నం, సారవకోట, సరుబుజ్జిలి మండలాల్లో శుక్రవారం అధిక ఉష్ణోగ్రతలతో పాటు వడగాడ్పులు తీవ్రంగా ఉంటాయని రాష్ట్ర విపత్తుల నిర్వాహణ సంస్థ హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉదయం 11 గంటల్లోగా కార్యకలాపాలు ముగించుకుని ఇళ్లకు చేరుకోవాలని పేర్కొంది.

56 మద్యం సీసాల స్వాధీనం

గార, మే7(ఆంధ్రజ్యోతి):కె.మత్స్యలేశం పంచాయతీ వాడపాలెం వద్ద బుధవారం వారాది సూర్యనారాయణ అనే వ్యక్తి నుంచి 56 మద్యం సీసాలను టాస్క్‌ఫోర్స్ సిబ్బంది స్వాధీనం చేసుకుని గార పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి సూర్యనారాయణను అదుపులోకి తీసుకున్నట్టు ఏఎస్ఐ మురళీ తెలిపారు.

22న హనుమాన్ శోభాయాత్ర

శ్రీకాకుళం కల్చరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలో ఈ నెల 22న వీర హనుమాన్ శోభాయాత్రను నిర్వహించనున్నట్లు విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు లోకనాథం ఆనందరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బజరంగ్ దళ్ జిల్లా అధ్యక్షుడు కొయ్యాన కిరణ్, జిల్లా సంఘ చాలక్ పీవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

శ్రీకాకుళం రూరల్, మే7 (ఆంధ్రజ్యోతి): సింగుపురం పంచాయతీలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే శంకర్ ప్రారంభించారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు మూడు నెలల పాటు శిక్షణ అందిస్తామని చెప్పారు. అనంతరం ఉచితంగా కుట్టు మిషన్ అందిస్తామని తెలిపారు. సర్పంచ్ గుండ ఆదిత్య నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు పంగ సత్యనారాయణ, కె.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పార్కులను అభివృద్ధి చేస్తాం

అరసవల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించేందుకు పార్కులను అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బుధవారం పుణ్యపు వీధిలో పార్కును, క్రీడా మైదానాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు సహకరించాలి

ఇచ్ఛాపురం, మే7(ఆంధ్రజ్యోతి): నవోదయం-2 కార్యక్రమం ద్వారా సారా నిర్మూలనకు అంతా సహకరించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత వారం రోజుల్లో ఐదు కేసులు నమోదు చేశామని తెలిపారు. సారా, గంజాయి వంటి మాదక ద్రవ్యాలపై 1440 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ప్రతిభావంతులకు సత్కారం

శ్రీకాకుళం, మే 7(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్ మీడియట్‌లో ఫలితాల్లో ప్రతిభ చూపిన ప్రభుత్వ విద్యార్థులను ప్రభుత్వం సత్కరించింది. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం అన్ని జిల్లాలకు చెందిన టాపర్లను మంత్రులు గుమ్మిడి సంధ్యారాణి, డోలా బాలవీరాంజనేయులు సత్కరించి ప్రశంసాపత్రాలను అందజేశారు. వీరిలో జిల్లాకు సంబంధించి సీనియర్ ఇంటర్ విద్యార్థులు పి.శ్రావణి (పాతపట్నం), బి.శ్రీమన్నారాయణ(శ్రీకాకుళం), కొర్రా ఆనందరావు(మల్లి), జి.భవాని (పొందూరు), పదో తరగతి విద్యార్థులు జన్ని దివ్యశ్రీ (సీతంపేట), పి.పూజ (సోంపేట)కె.కీర్తిక(నందిగాం), ఎస్.జ్ఞానవతి (నెలబొంతు), సవర స్వాతి (వెన్నెలవలస), డి.షర్మిల(భీమాపురం), దాసరి మనెమ్మ(కోటబొమ్మాళి), కుంచి కీర్తన(పాతపట్నం) ఉన్నారు.

సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలి

- కలెక్టరేట్ వద్ద రైతు సంఘ నాయకుల ధర్నా

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి కె.మోహనరావు, కౌలు రైతు సంఘం అధ్యక్షుడు వెలమల రమణ డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. జిల్లాలో వంశధార, నాగావళి, మహేంద్రతనయ, బాహుదా వంటి జీవనదులు, మరెన్నో గెడ్డలు, వాగులు ఉన్నా నీరు వృధాగా సముద్రంలో కలిసిపోతుందన్నారు. నారాయణపురం ప్రాజెక్టు కూడా రైతులకు సాగునీరు అందించడం లేదన్నారు. ప్రాజెక్టులను పూర్తిచేసి, శివారు భూములకు నీరందించాలని, వలసలను నివారించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు పి.చంద్రరావు, నాయకులు కె.కొండయ్య, బి.వాసు. ఎం.అజయ్, ముద్దాడ రమణ, రుప్ప ఆదినారాయణ, జె.కృష్ణారావు, అల్లు సూర్యనారాయణ, ఎన్.రంగారావు, నీలం తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న రైతుసంఘం నాయకులు

'ఈ-శ్రమ్'తో అసంఘటిత కార్మికులకు చేయూత

- జిల్లా లేబర్ అధికారి నీలామోహన్

లావేరు, మే 7(ఆంధ్రజ్యోతి): ఈ-శ్రమ్ బీమాతో అసంఘటిత కార్మికులకు చేయూత లభిస్తుందని జిల్లా లేబర్ అధికారి ఎం.నీలామోహన్ తెలిపారు. బుధవారం లావేరు ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ శ్రమ్ బీమాలో చేరడానికి ఎటువంటి రుసుం చెల్లించనవసరం లేదన్నారు. 18 నుంచి 60 ఏళ్ల లోపు వయస్సుగల వారు అర్హులన్నారు. ఒకసారి రిజిస్ట్రేషన్ చేయించుకుంటే 60 ఏళ్ల వయస్సు వచ్చినంత వరకు బీమా వర్తిస్తుందని చెప్పారు. ప్రమాదంలో మృతి చెందిన వారికి రూ.2 లక్షల వరకు బీమా సదుపాయం కల్పించినట్లు తెలిపారు. శాశ్వత వికలాంగులైనా రూ.2 లక్షలు బీమా వర్తిస్తుందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 4,77,384 మంది ఈశ్రమ్ బీమాలో చేరారని, ఇంకా 4,53,989 మంది మిగిలి ఉన్నట్లు గుర్తించామన్నారు. జిల్లాలోని ఉపాధి వేతనదారులకు, సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సహాయ లేబర్ అధికారి ఆర్‌వీ శ్రీనివాసరావు, ఏపీవో సత్యవతి, జేఈ లెలిన్‌బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా లేబర్ అధికారి నీలామోహన్

కార్మిక చట్టాలపై అవగాహన అవసరం

ఇచ్ఛాపురం, మే 7(ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాలపై అవగాహన అవసరమని జూనియర్ సివిల్ న్యాయాధికారి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ పి.పరీష్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ద్వారా ఉచిత న్యాయ సలహాలు పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది ఎం.రాంబాబు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆటో, రిక్షా కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి పరీష్‌కుమార్

అవగాహన లేక ఇబ్బందులు


మాట్లాడుతున్న న్యాయాధికారి కిశోర్‌బాబు

కంచిలి/సోంపేట, మే7(ఆంధ్రజ్యోతి): కార్మికుల కోసం అనేకచట్టాలు ఉన్నాయని, వాటిపై అవగాహన లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆరవ అదనపు జిల్లా న్యాయాధికారి, మండల న్యాయసేవా అధికార సంఘం అధ్యక్షులు కిశోర్‌బాబు అన్నారు. బుధవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతీ కార్మికుడు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని, ప్రమాదాలు జరిగినపుడు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి కె.శ్రీనివాసరావు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి.జగన్నాయకులు, బేసి లక్ష్మీనారాయణ, ఎస్ఐ పారినాయిడు, సోంపేట బార్ అధ్యక్షుడు జి.శైలేంద్ర పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

కవిటి, మే7(ఆంధ్రజ్యోతి): కవిటి ఎస్‌వీజే ఇనిస్టిట్యూట్ ఆవరణలో గురువారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది. పేరొందిన కంపెనీలు వస్తున్నాయని, మండలానికి చెందిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరింది.

ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన

కవిటి, మే7(ఆంధ్రజ్యోతి):లండారిపుట్టుగ ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్సీ ఎన్.రామారావు బుధవారం శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ నిధులతో ఈ పనులు చేపట్టనున్నట్లు ఎంపీపీ కె.పద్మ తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు కె.ప్రకాష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

ఆమదాలవలస, మే7(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కొర్లకోట సర్పంచ్ ప్రతినిధి సనపల అప్పలనాయుడు అన్నారు. బుధవారం గ్రామ రామమందిరం వద్ద స్వచ్ఛతే కళా జాతా బుర్రకథ ప్రదర్శన నిర్వహించారు. గ్రీన్ అంబాసిడర్లు ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీటీసీ సభ్యుడు అన్నెపు భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి రుప్ప విజయసాగర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ● చీమలవలస పంచాయతీలో స్వచ్ఛ భారత్‌లో భాగంగా ఇంటింటా చెత్త సేకరణ చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి బగాది కృష్ణకుమార్, ఎంఆర్‌సీ కామేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో సిరిమానోత్సవాలు ప్రారంభం


ఎనుపోతుకు పూజలు చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): పాతశ్రీకాకుళంలో సిరిమానోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. దండి వారి ఇంటి నుంచి సిరిమాను కమిటీ సభ్యులు, ప్రజలు జంగిడితో దుర్గమ్మ ఆలయానికి వెళ్లి అమ్మవారికి ఉపవాసం చెప్పారు. ఎనుపోతుకి పూజలు నిర్వహించి సిరిమానోత్సవాలు ప్రారంభమయ్యాయని చాటింపు వేసి దేవర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు డీపీ దేవ్, సభ్యులు కునుకు కోటేశ్వరరావు, అదపాక రాంబాబు, గుత్తు చిన్నారావు, నక్క శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు చేయాలి

శ్రీకాకుళం అర్బన్, మే 7 (ఆంధ్రజ్యోతి): పాత శ్రీకాకుళం గ్రామదేవతల సిరిమానోత్సవాలకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఈ మేరకు శ్రీకాకుళం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న ఎలక్ట్రికల్, కేబుల్ వైర్లను యుద్ధ ప్రాతిపదికన మార్పు చేయాలన్నారు. సిరిమాను ఉత్సవ సమయంలో రోడ్డును ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. శానిటేషన్ సిబ్బంది చాలకపోతే వేరే ప్రాంతాల నుంచి తెప్పించాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు, డిప్యూటీ డీఎం హెచ్‌వో మేరీ క్యాథరిన్, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు విబూది సూరిబాబు, డాక్టర్ శివ ప్రసాద్, నక్క శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగంలో చేరిన మూడు నెలలకే..

● విధి నిర్వహణలో రిమ్స్ ఉద్యోగి మృతి
● గన్నవరం వద్ద గుండెపోటు


కిషోర్ (ఫైల్)

శ్రీకాకుళం రిమ్స్, మే 7(ఆంధ్రజ్యోతి): ఉద్యోగంలో చేరిన మూడు నెల లకే ఓ యువకుడు మృతి చెందాడు. శ్రీకాకుళం రిమ్స్ నర్సింగ్ కళాశాలలో ల్యాబ్ అటెండర్‌గా పనిచేస్తున్న గౌడ కిషోర్(23) ఉద్యోగ నిర్వహణలో భాగంగా విజయవాడలోని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి వెళ్లాడు. పని ముగిసిన తరువాత తిరుగు ప్రయాణంలో బుధవారం బస్సులో వస్తుండగా గన్నవరం వద్ద గుండెలో నొప్పి రావడంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే కిశోర్ గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని వద్ద గల సెల్‌ఫోన్ ద్వారా వివరాలను తెలియజేయడంతో కళాశాల సిబ్బంది, మిత్రులు హుటాహుటిన తరలివెళ్లారు. కిశోర్ తండ్రి చనిపోగా తల్లి మాత్రమే ఉంది. ప్రస్తుతం నగరంలోనే ఒక రూమ్ అద్దెకు తీసుకుని ఉంటున్నాడని,ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఉద్యోగంలో చేరాడని స్నేహితులు తెలిపారు.

పండగకు వచ్చి.. విగతజీవిగా మారి

● బావిలో పడి విద్యార్థి మృతి


గౌతమ్‌రాజ్‌కుమార్ మృతదేహం

రణస్థలం, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్జునవలస సమీపంలోని బావిలో పడి వడ్డాది గౌతమ్‌రాజ్‌కుమార్ (15) బుధవారం మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. విశాఖపట్నంకు చెందిన గౌతమ్ తన తల్లిదండ్రులతో కలిసి అర్జునవలసలో జరిగిన గ్రామ దేవత పండగకు వచ్చాడు. బుధవారం మధ్యాహ్నం మరో విద్యార్థి దుర్గా ప్రసాద్‌తో కలిసి స్నానం చేసేందుకు బావి వద్దకు వెళ్లాడు. బావిలోకి దిగిన గౌతమ్‌కు ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. గౌతమ్ ఇటీవల పదోతరగతిలో ఉత్తీర్ణత సాధించాడని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. తండ్రి లక్ష్మణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్‌పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారా విక్రేతకు జైలు, జరిమానా

పలాస/వజ్రపుకొత్తూరు, మే 7(ఆంధ్రజ్యోతి): సారా విక్రయించిన ఓ మహిళకు 12 నెలల జైలుశిక్షతో పాటు రూ.2 లక్షల జరిమానా విధిస్తూ పలాస మున్సిఫ్ కోర్టు న్యాయాధికారి యు.మాధురి బుధవారం తీర్పు ఇచ్చారని కాశీబుగ్గ ఎక్సైజ్ సీఐ కె.మల్లికార్జునరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. 2021 నవంబరు 29న వజ్రపుకొత్తూరు మండలం గుణుపల్లికి చెందిన చొక్కర నారాయణమ్మ సారా అమ్ముతూ పట్టుబడింది. అప్పటి సీఐ కె.కృష్ణారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. దీనిపై విచారించి నేరం రుజువు కావడంతో తుది తీర్పును న్యాయాధికారి బుధవారం వెల్లడించారు. ఈ కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.రమేష్ వాదించారు.

హ్యాండ్‌బ్యాగ్ అప్పగించిన రైల్వే పోలీసులు

పలాస, మే 7(ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణికురాలు మరిచిపోయిన హ్యాండ్ బ్యాగును పలాస రైల్వే పోలీసులు బాధితులకు బుధవారం అప్పగించారు. హెచ్‌సీ సోమేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సమ్మర్ స్పెషల్ (07165) ఏసీ కోచ్‌లో ప్రయాణిస్తున్న మునుగుల కమల తన బ్యాగును సీటుపై విడిచి శ్రీకాకుళం రోడ్డులో దిగిపోయారు. హ్యాండ్ బ్యాగు మరిచిపోయినట్లు గుర్తించి అక్కడి పోలీసులకు సమాచారమిచ్చారు. పలాస రైల్వే పోలీసులకు ఫోన్ ద్వారా హ్యాండ్‌బ్యాగు మరిచిపోయిన విషయం తెలిసిన వెంటనే బ్యాగును గుర్తించి అప్పగించారు. అందులో రెండున్నర తులాల బంగారు ఆభరణాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ సందర్భంగా పోలీసులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

8 మద్యం సీసాలతో ఒకరి అరెస్ట్

కొత్తూరు, మే 7(ఆంధ్రజ్యోతి): బమ్మిడి గ్రామలో మద్యం అమ్ముతున్న అన్నెపు ఫల్గుణరావు వద్ద 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అతడిని అరెస్ట్ చేసినట్లు ఏఎస్ఐ గోవిందరావు తెలిపారు. గ్రామంలో పండుగల సందర్భంగా బడ్డీకొట్టులో రహస్యంగా మద్యం విక్రయిస్తున్నట్లు వచ్చిన సమా చారం మేరకు దాడి చేసినట్లు తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

పలాసరూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాధిత కుటుంబాలకు స్వచ్ఛంద సంస్థలు సాయమందించి భరోసా కల్పించాయి. బ్రాహ్మణతర్లాకి చెందిన వైశ్యరాజు మణి 15 రోజుల కిందట రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం శ్రీకాకుళం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు అతని చికిత్స నిమిత్తం గ్రామానికి చెందిన హెల్పింగ్ వారియర్స్ ప్రతినిధులు, మరికొందరు గ్రామస్థులు బుధవారం రూ.1.63 లక్షలు సాయం అందించారు. కార్య క్రమంలో ఎల్.వేణుగోపాల్, ఎస్.నరేష్, ఆర్‌జె.ఈశ్వర్, పి.కార్తీక్, అభి పాల్గొన్నారు. అదే విధంగా గురుదాసుపురానికి చెందిన బూరగాపు సూర్యం మెదడుకు సంబంధించిన వ్యాధితో బాధపడుతుండగా విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు రూ.63 వేలు అందజేశారు. సంఘ అధ్యక్షుడు సింహాద్రి ధనుంజయ, నాయకులు పాల్గొన్నారు.

జూన్ నెలాఖరుకు పిల్ల కాలువల పనులు: డీఈ


ఎల్.ఎన్.పేట, మే 7(ఆంధ్రజ్యోతి): వంశధార నది కుడి ప్రధాన కాలువకు అనుసంధానంగా ఉన్న పిల్ల కాలువల పనులను జూన్ నెలాఖరు నాటికి పూర్తి చేస్తామని వంశధార డీఈ ఎ. రామకృష్ణ తెలిపారు. మండలంలోని 7ఎల్ పిల్ల కాలువను బుధవారం పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. 4ఎ ఎల్ కాలువ నుంచి 10ఎల్ కాలువ వరకు పిల్ల కాలువల డిస్ట్రిబ్యూటర్లు, కాలువ గట్లు, గండ్లు తదితర పనులన్నింటినీ పూర్తిస్థాయిలో చేపట్టేందుకు ఉపాధి హామీ నిధులు రూ.1.3 కోట్లు కోసం సంబంధిత జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామన్నారు. ఏఈలు శ్రీనివాసరావు, దిలీప్ పాల్గొన్నారు.

జయహో భారత్


ర్యాలీ చేస్తున్న ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు

నరసన్నపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణకు యువత ముందుడుగు వేయాలని, అవసర మైతే యుద్ధంలో పాల్గొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆర్ఎస్ఎస్ పరివార్ ప్రతినిధులు కోరారు. బుధవారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో జయహో భారత్ అంటూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు చింతు పాపారావు, కేఎల్ఎన్ మూర్తి, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

● కంచిలి, మే 7 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ చారిత్రక విజయమని మాజీ సైనికోద్యోగుల సంఘం ప్రతినిధులు అన్నారు. ఈ మేరకు బుధవారం కంచిలి పట్టణంలో జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. మాజీ సైనికోద్యోగులు, కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.


కంచిలి: ర్యాలీలో పాల్గొన్న మాజీ సైనికోద్యోగులు, గ్రామస్థులు

అనుమానంతో భార్య దారుణ హత్య

● కోటబొమ్మాళి మెయిన్‌రోడ్డులో ఉలికిపాటు
● పోలీసుల అదుపులో భర్త

జిల్లాలో రెండు హత్యలు సంచలనం కలిగించాయి. కోటబొమ్మాళిలో భార్యను భర్త హత్య చేయగా, శ్రీకాకుళం మండలం ఇప్పిలిలో ఓ వృద్ధుడు హత్యకు గురయ్యాడు.


నిందితుడు శ్రీనివాసరావు



హత్య జరిగిన బ్యూటీ పార్లర్ ఇదే..

టెక్కలి, మే 7(ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానంతో కిరాతకంగా హత్య చేసిన ఘటన కోట బొమ్మాళి మెయిన్ రోడ్డులోని ఓ బ్యూటీపార్లర్ వద్ద బుధవారం సంభవించింది. అయితే వివాహేతర సంబంధమే కారణమా అన్న అనుమానాలు పలువురి నుంచి వ్యక్తమవుతున్నాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సంతబొమ్మాళి మండలం నర్సాపురం గ్రామానికి చెందిన నర్సిపురం తిరుపతిరావు, లక్ష్మి కోటబొమ్మాళి విద్యుత్ నగర్‌లో కొంతకాలంగా నివాస ఉంటున్నారు. లక్ష్మి కోటబొమ్మాళిలో హర్షిణి బ్యూటీ పార్లర్ అండ్ లేడీస్ కార్నర్‌ను నిర్వహిస్తోంది. ఆమె భర్త తిరుపతిరావు కేబుల్ ఆపరేటర్. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరగడంతో కోటబొమ్మాళి పోలీస్ స్టేషన్‌లో భర్తపై లక్ష్మి ఫిర్యాదు చేసింది. అలాగే తన భార్య వివాహేతర సంబంధానికి కోటబొమ్మాళికి చెందిన ఓ కానిస్టేబులే కారణమని, దీనిపై దర్యాప్తు చేపట్టాలని నిందితుడు శ్రీనివాసరావు ఎస్పీకి సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ విషయంలో శాఖాపరంగా అంతర్గత విచారణ జరుగుతున్నట్లు సమాచారం. నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో భార్య లక్ష్మి బ్యూటీ పార్లర్ లో ఉండగా భర్త తిరుపతిరావు నేరుగా కత్తితో వెళ్లి ఆమె పీకను కోసి ముఖంపై దాడి చేసి అక్కడ నుంచి పారిపోయాడు. రక్తపు మడుగులో ఉన్న లక్ష్మిని స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే కోటబొమ్మాళి పోలీసులు అక్కడికి చేరుకున్నారు. నిందితుడైన శ్రీనివాసరావు కోసం పోలీసులు గాలించగా ఓ మద్యం దుకాణం వద్ద పట్టు బడినట్లు సమాచారం. క్లూస్‌టీం ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఇన్‌చార్జి సీఐ ఎ.విజయ్ కుమార్ నేతృత్వంలో ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోటబొమ్మాళి సీహెచ్‌సీకి తరలించారు. మృతురాలికి కుమార్తె, కుమారుడున్నారు. ఈఘటనతో కోటబొమ్మాళి ఉలికిపాటుకు గురైంది.

ఇప్పిలిలో వృద్ధుడు..

● నిద్రలోనే చంపేసిన వైనం
● పోలీసుల అదుపులో నిందితుడు?


నర్సింగరావు(ఫైల్)

శ్రీకాకుళం రూరల్, మే7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పిలి గ్రామంలో కరణం నర్సింగరావు (63) అనే వృద్ధుడు దారుణ హత్యకు గురయ్యాడు. మంగళవారం రాత్రి తన ఇంటి మేడపై నిద్రిస్తున్న ఆయన్ను కత్తవతో కొట్టి చంపేశారు. బుధవారం ఉదయం కుటుంబ సభ్యులు నిద్ర లేచి చూడగా నర్సింగరావు రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉన్నాడు. వెంటనే వారు రూరల్ పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్ఐ కె.రాము తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం సీఐ పైడపునాయుడు కూడా చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. క్లూస్ టీం ఘటనా స్థలంలో ఆధారాలను సేకరించింది. మృతదేహాన్ని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య యశోద ఫిర్యాదు మేరకు శ్రీకాకుళం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘర్షణే కారణమా?

నర్సింగరావుకు తన ఇంటి ఎదురుగా ఉన్న రమణకు మంగళవారం రాత్రి ఘర్షణ జరిగింది. నర్సింగరావు తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ఎదురుగా పెట్టడంతో రమణ గొడవకు దిగాడు. దీంతో స్థానికులు వారికి సర్ది చెప్పారు. దీన్ని మనసులో ఉంచుకొని మేడ మీద నిద్రపోతున్న నర్సింగరావుపై రమణ దాడి చేసి ఉంటాడని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆ దిశగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. రమణ పరారీలో ఉండడంతో ఆయన కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఎచ్చెర్ల మండలం జీరుపాలెంలో వద్ద రమణను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

పట్టణాభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే శిరీష


పలాస: సీసీ రోడ్డు పనుల శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, మే 7(ఆంధ్రజ్యోతి): పట్టణ అభివృద్ధే ధ్యేయమని, అన్ని వార్డుల్లో పనులు చేపడతామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. 18వ వార్డు ఐటీఐ మార్గంలో రూ.7.30 లక్షలతో సీసీ రోడ్డు, 4వ వార్డు మీలగారంపాడులో రూ.5 లక్షలతో కంకర రోడ్డు పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టీడీపీ హయాంలోనే మునిసిపాలిటీ అభివృద్ధి చెందిందన్నారు. అన్ని వార్డుల్లో రోడ్లు, కాలువల నిర్మాణంతో పాటు తాగునీరు, విద్యుత్ సౌక ర్యం కల్పించడం జరిగిందన్నారు. శివారు ప్రాంతాల్లోనూ రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, కమిషనర్ ఎన్.రామారావు, టీడీపీ నాయకులు లొడగల కామేశ్వరరావు యాదవ్, గురిటి సూర్యనారాయణ, ఎం.నరేంద్ర, మల్లా శ్రీనివాస్, ఎ.రామకృష్ణ, సత్యం, దడియాల నర్సింహులు పాల్గొన్నారు.

మా గ్రామాన్ని వజ్రపుకొత్తూరులో విలీనం చేయండి

సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న మా గ్రామాన్ని జనాభా చాలలేదని పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో కలిపారని, కనీస సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, మా గ్రామాన్ని వజ్రపుకొత్తూరు మండలంలో విలీనం చేయాలని మీలగారంపాడు గ్రామ ప్రజలు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే శిరీషను కలిసి తమ గోడును వెలిబుచ్చారు. పల్లిసారధి, రాజాం పంచాయతీలకు సమీపంలో మా గ్రామం ఉందని, మునిసిపాలిటీకి సంబంధం లేకున్నా కేవలం జనాభా కోసం పట్టణంలో విలీనం చేశారని, న్యాయం చేయాలని కోరారు.

ఆర్థిక స్వావలంబన సాధించాలి

పలాసరూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించి స్వయం ఉపాధి పొందాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. వెలుగు కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు అందించనున్న కుట్టు శిక్షణ శిబిరాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వసంత్‌కుమార్, టీడీపీ నేతలు వీరికట్ల విఠల్, కుత్తుమ లక్ష్మణ్‌కుమార్, దువ్వాడ సంతోష్, వెలుగు అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

రుణపడి ఉంటాం: పూడిలంక వాసులు

వజ్రపుకొత్తూరు, మే 7(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పూడిలంక రోడ్డు నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు చేయడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే గౌతు శిరీషను ఆమె క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మీరు చేసిన కృషికి రుణపడి ఉంటామంటూ ఆనందభాష్పాలు రాల్చారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి గ్రామ మహిళలు మిఠాయిలు తినిపించి తమ ఆనందాన్ని వ్యక్తంచేశారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు: ఎమ్మెల్యే ఎంజీఆర్


ప్రత్యేకావసరాల చిన్నారులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. కొరసవాడ నుంచి శివరాంపురం వరకు ఉపాధి నిధులు రూ.70 లక్షలతో చేపట్టనున్న బీటీ రోడ్డు పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. దశాబ్దాల నుంచి ప్రజల కల సాకారం చేస్తామన్నారు. కార్యక్ర మంలో కూటమి నేతలు, పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబనతోనే భద్రత

మహిళలకు ఆర్థిక స్వావలంబనతోనే నిజమైన భద్రత లభిస్తుందని ఎమ్మెల్యే మామిడి గోవింద రావు అన్నారు. స్థానిక వేంకటేశ్వర దేవాలయం సమీపంలోని సామాజిక భవనంలో బీసీ కార్పొ రేషన్, ఈడబ్ల్యూఎస్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. 90 రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.చంద్రకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకవసరాల పిల్లలను ప్రోత్సహించాలి

ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలు వారు ఏ రంగంలో ఆసక్తిగా ఉన్నారో గుర్తించి ప్రోత్సహించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక ఎమ్మార్సీ ప్రాంగణంలోని భవిత కేంద్రంలో సమగ్రశిక్షా ద్వారా మంజూరు చేసిన ట్రైసైకిళ్లు, వాకర్ స్టాండ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో సీహెచ్ తిరుమలరావు, ఎన్డీఏ కూటమి నేతలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పనుల వద్ద సదుపాయాలు కల్పించాలి

కొత్తూరు, మే 7(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల వద్ద వేతనదారులకు సదుపాయాలు కల్పించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న కోరారు. కొత్తూరు మండలంలో కొండల ప్రాంతంలో ఉపాధి పనుల వద్ద నిలువ నీడ లేదన్నారు. అధికారులు స్పందించి తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేయాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ, మెడికల్ కిట్లు అందించాలని ఆయన కోరారు.

ఉమిలాడకు రెండు బోర్లు మంజూరు

సంతబొమ్మాళి, మే 7(ఆంధ్రజ్యోతి): ఉమిలాడ గ్రామానికి తాగునీటి సమస్య తీరనుంది. స్థానికుల విన్నపం మేరకు మంత్రి అచ్చెన్నాయుడు రెండు బోర్లను మంజూరుచేశారు. బోరు తవ్వే పనులను బుధవారం ప్రారంభించారు. తాగునీటి సమస్య పరిష్కరించిన మంత్రికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వెంకన్న స్వామి గరుడసేవ


గరుడ వాహనంపై వెంకన్న స్వామి తిరువీధి

నందిగాం, మే 7(ఆంధ్రజ్యోతి): పెంటూరులో వేంకటేశ్వరస్వామి ఆలయ 23వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం గరుడ వాహనసేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామిని గరుడ వాహనంపై వేంచేపు చేసి మేళతాళాలు, బాణసంచా కాల్పులు, మహిళల కోలాట ప్రదర్శనల నడుమ తిరువీధి చేపట్టారు. అంతకుముందు ధర్మకర్తలు బొడ్డ జనార్దనరావు, కృష్ణారావు, నారాయణరావు ఆధ్వర్యంలో వేదపండితులు రాజగోపాలాచార్యులు, వరహానరసింహాచార్యులు, మణికంఠాచార్యులు, రంగనాథాచార్యులు పర్యవేక్షణలో వివిధ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేపట్టారు. ఊరేగింపులో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. శుక్రవారం స్వామి కల్యాణం నిర్వహి స్తున్నట్లు ధర్మకర్తలు తెలిపారు. ● దిమ్మిడిజోలలో షిర్డీసాయిబా ధ్యానమందిరంలో ప్రతిష్ఠోత్స వాలు రెండో రోజు బుధవారం సాగాయి. ధర్మకర్త సలాన వెంకట్రావు మాస్టారు, వాణిశ్రీ దంపతుల ఆధ్వర్యంలో పురోహితులు మదన్‌మోహన్‌మిశ్రా, చంద్రశేఖర్ శర్మ పర్యవేక్షణలో విశేషపూజలు నిర్వహించారు. కాపు తెంబూరు దత్త పీఠాధిపతి నిర్విశ్యానంద స్వామీజీ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు.

ఘనంగా మరిడమ్మ అమ్మవారి పండుగ


ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

పోలాకి, మే 7(ఆంధ్రజ్యోతి): సాగరతీర గ్రామమైన చిన్నకొవిరిపేటలో బుధవారం మరిడమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. మరిడమ్మ అమ్మవారి ఇంటి పండుగలకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట ఎంవీ నాయుడు, ధనలక్ష్మి, భైరి భాస్కరరావు, కొమర ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సిరిమానోత్సవాలు

● కిక్కిరిసిన మాకివలస


మాకివలస గ్రామానికి తరలివస్తున్న జనం

నరసన్నపేట, మే 7(ఆంధ్రజ్యోతి): మాకివలస గ్రామంలో గ్రామ దేవత అసిరితల్లి సిరిమానోత్సవాలు బుధవారంతో ముగిశాయి. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రసాదం స్వీకరించేందుకు తరలిరావడంతో గ్రామం కిక్కిరిసిపోయింది. దేవాది నుంచి మాకివలస వరకు జనం, వాహనాలు బారులుతీరాయి. శ్రీకాకుళం నుంచి వచ్చే వాహనాలను పోతయ్యవలస మీదుగా దారి మళ్లించారు. సీఐ జె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సిరిమానోత్సవం ముగింపులో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణస్వామి వ్రతాలు


సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

జలుమూరు, మే 7(ఆంధ్రజ్యోతి): గొటివాడ గ్రామంలోని వీర వెంకటసత్యనారాయణ స్వామి ఆయంలో బుధవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా అర్చకుడు మాగంటి ప్రసాద్ నేతృత్వంలో సుప్రభాత సేవ, ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకం చేసి తోమాల సేవ నిర్వహించారు. కార్యక్రమంలో పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

● లింగాలవలసలో వీరబ్రహ్మేంద్రస్వామికి విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి 332వ ఆరాధన సందర్భంగా ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో పలువురు సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

టీఏపై వేతనదారుల ఫిర్యాదు

మెళియాపుట్టి, మే 7(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ రమణపై పెద్ద పద్మాపురం గ్రామ వేతనదారులు బుధవారం ఎంపీడీవో ప్రసాద్ పండాకు ఫిర్యాదు చేశారు.గత కొన్నాళ్ల నుంచి తాము పనుల చేస్తున్నా చేయడం లేదని దుర్భాషలాడుతూ దురుసుగా వ్యవహరిస్తున్నారని ఎంపీడీవో దృష్టికి తీసుకువెళ్లారు. ఇదే కొనసాగితే తాము పనులకు వెళ్లే పరిస్థితి లేదని, తగు చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

పీవోకి సమ్మె నోటీసు

పలాసరూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి గాను దేశవ్యాప్తంగా ఈనెల 20 నుంచి చేపడుతున్న సమ్మె నేపథ్యంలో బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలు ఐసీడీఎస్ పీవో పార్వతికి నోటీసు అందించారు. సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. అంగన్‌వాడీ సంఘ ప్రతినిధులు ఆర్. అప్పలనర్సమ్మ, జయలక్ష్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.

కంటి శస్త్రచికిత్సలకు 15 మంది ఎంపిక

ఎల్.ఎన్.పేట, మే 7(ఆంధ్రజ్యోతి): శ్యామలాపురంలో బుధవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ వైద్యులు 45 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 15 మందిని కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. మిగిలిన వారికి మందులను అందించారు. క్యాంప్ కో-ఆర్డి నేటర్ కె.సోమేశ్వరరావు, పి.సీతారాం పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సంతబొమ్మాళి, మే 7(ఆంధ్రజ్యోతి): బోరుభద్ర విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని టెక్కలి ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు తెలిపారు. 132-33 కేవీ నరసన్నపేట, బోరుభద్ర, పిన్నింటిపేట ఫీడర్‌లలో మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నామన్నారు. అందువల్ల బోరుభద్ర సబ్‌స్టేషన్ పరిధిలోని బోరుభద్ర, లక్కివలస, మేఘవరం, మరువాడ, మలగాం, పాలతలగాం, ఆర్‌హెచ్‌పురం, జగన్నాథపురం, ఉమిలాడ పంచాయతీల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పిన్నింటిపేట సబ్ స్టేషన్ పరిధిలో..

పోలాకి, మే 7(ఆంధ్రజ్యోతి): పిన్నింటిపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 33 కేవీ, నిమ్మాడ ఫీడర్ లో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు టెక్కలి ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు, ఏఈ విశ్వేశ్వరరావు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆరోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. గుప్పెడుపేట, గుల్లవానిపేట, జోగంపేట కంబాలవానిపేట, పరపతివానిపేట, రేగుపాడు, బార్జిపాడు, మగతపాడు, రాజపురం, శివరాంపురం, బొద్దాం, బెలమర ప్రియాగ్రహారం, కాకినాడపేట, వెంకటరత్నంపేట, గాతలవలస, వీరయ్యపేట, దండులక్ష్మీపురం, సత్రవుపేట, అక్కువరం, సొండిపేట, అప్పారావుపేట కాలనీ, బెలమర, చిన్నకోడూరు పరిధిలోని గ్రామాల వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తులు

టెక్కలి, మే 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రానున్న విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలి పారు. ఇంటర్మీడియెట్, తత్సమాన పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు నేరుగా కళాశాలలో దరఖాస్తులు అందజేయాలన్నారు. ఈనెలలో జరిగే సప్లిమెంటరీ పరీక్షల అనంతరం ఆన్‌లైన్ ప్రవేశాలు ఉంటాయని, విద్యార్థులు ముందుగా దరఖాస్తులు చేసి సీటు రిజర్వ్ చేసుకోవాలని కోరారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

టెక్కలి, మే 7(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల అనర్థాలు సంభవిస్తాయని, అందువల్ల యువత వీటికి దూరంగా ఉండాలని ఈగల్ జిల్లా అధికారులు ఉదయ్, రామచంద్రరావు, మల్లేశ్వరరావు, శంకరరావు అన్నారు. స్థానిక ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఐతమ్ ఈగల్ క్లబ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సే టు నో డ్రగ్స్ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎస్ శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ శాంతికుమార్, అసోసియేట్ డీన్ ఎ. లక్ష్మణరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మారతి, ఎం.రమణయ్య పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ శిక్షణ ప్రారంభం

నరసన్నపేట, మే 7(ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ కళశాల మైదానంలో నరసన్నపేట ఫుట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణా శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. నెలరోజుల పాటు క్రీడాకారులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఉర్లాం రాజేష్ తెలిపారు. ప్రతిరోజు ఉదయం, సాయం సమయాల్లో ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు జెర్సీలు, ఫుట్‌బాల్‌లను అందజేశారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి పొట్నూరు రమేష్, బంకుపల్లి రవి, రాకేష్, నివాస్ పాల్గొన్నారు.